తెలుగు కళాసమితి న్యూజెర్సీ వారి 1988 విభవ ఉగాది మినీ కథల పోటీలో రు. 150 లు బహుమతి పొందిన కథ




# బొట్టు

## షేక్ రహమత్ బాషా

అటు పల్లెటూరికీ, ఇటు పట్టణానికి మధ్య వారధికి ప్రతిబింబం ఆ వూరు. అటు గ్రామీణ వాతావరణానికి, ఇటు నాగరిక జీవితానికి మధ్య వూగిసలాడుతున్న ఓ మోస్తరు గ్రామం అది.

ఆ ప్రాంతానికి మకుటం లేని మహారాజు చిలకల చెంచురామయ్య. సింగరేణి గనులతో పోటీ పడినా ఓడిపోయే ప్రమాదమున్న అందం అతనిది. ఓ మినీ సైజు చెరువులాంటి పొట్ట. రంగులో రంగు కలిసిపోయి పరీక్షగా చూస్తేగాని కనుక్కోలేని జానెడు సైజు మీసాలు.

అతని శరీరంలో ఎవరికైనా కనిపించేది రెండే రెండు వస్తువులు. మొదటిది శరీరాన్ని అంటిపెట్టుకొని వుండే బట్టలు, రెండోది నుదుటిపై రూపాయి సైజు కుంకుమ బొట్టు. బాగా తేరిపారచూస్తే మెడ కింద కూడా ఓ బొట్టు కనిపిస్తుంది.

ఎండుగడ్డి వ్యాపారం మొదలు వడ్డీ వ్యాపారం వరకు అన్నీ తనే స్వయంగా చూసుకొంటూ వుంటాడు. ఈ మధ్యనే ఓ సైకిల్ షాపు కూడా తెరిచాడు. ప్రతి ఆదివారం ఓ జీవాన్ని కోయడం, దాంతో ఎంతో కొంత లాభాన్ని వెనకేసుకోవడం, కోళ్ళు, కూరగాయల మారుబేరం చేయడం అలవాటైపోయింది అతనికి.

వడ్డీ కట్టలేకపోయిన ఫకీరయ్య ఎడ్ల బండి తనపరమైపోయిందీ మధ్యే. మంచినీటికి జనమంతా కటకటలాడుతుంటే మెరుపులా వచ్చేసింది ఒక ఐడియా. ఒక సెకండ్ హాండ్ పీపా కొనేసి బండిలో బిగించేశాడు చెంచురామయ్య. దాంతో నీళ్ళ వ్యాపారం కూడా మొదలెట్టినట్లయింది.

రోజుకు కనీసం రెండొందల సంపాదన లేకుంటే నిదరేపట్టని స్వభావం అతనిది. సంపాదించడంలో ఎంత నిష్టగా వుంటాడో అంతకంటే ఎక్కువ నిష్టతో ఖర్చుపెడతాడు.

తెల్లవారగానే ప్లాట్‌ఫారం మీది రెండిడ్లీలతో సరిపెట్టుకొంటాడు. మధ్యానానికి, రాత్రికి కలిపి ఒకే సారి స్వయంపాకం మొదలుపెడతాడు. లేకుంటే ఇంధనం ఖర్చు పెరిగిపోయే ప్రమాదముంది. ఒకవేళ రాత్రికేమైనా నాలుగు మెతుకులు మిగిలితే తెల్లవారి ఇడ్లీల కోసం ప్లాట్‌ఫారం పైకి పోవాల్సిన అవసరమే లేదు. ప్రతి ముప్పై రోజులకో అగ్గిపెట్టె, ఓ సబ్బు బిళ్ళతో సరిపెట్టుకోవచ్చు.

వారానికో గుడ్డు. అదీ మధ్యానం సగం, రాత్రికి సగం. తన ఇంటి దగ్గరున్న బంకులో గుడ్డుకు పదిపైసలెక్కువ. అందుకే సైకిల్ వేసికొని బజారుకెళ్ళి స్వహస్తాలతో ఓ గుడ్డుకొని పది పైసలు వెనకేసికొంటుంటాడు.

శుభకార్యాలకు ఎవరు పిలిచినా తప్పకుండా వెళ్ళి కడుపు నిండా భోంచేసి రేషన్ మిగుల్చుకొనే అలవాటు అతనిది.

ఉదయం లేచింది మొదలు రాత్రి కునుకు తీసేంత వరకు బొట్టు లేకుంటే సహించదు పాపం ఆ భక్త పుంగవునికి. నిద్దుర లేస్తూనే స్నానం అయిందనిపించాక వేప బంక అతికించి దానిపై కుంకుమ బొట్టు పెట్టుకోవడం అతని నిత్యకృత్యమై పోయింది. అతి పవిత్రమైన కుంకుమను వృధాగా ఖర్చుపెట్టే మనస్తత్వం కాదతనిది.

సర్వవేళలా బొట్టును ఆరాధించే చెంచురామయ్య పుట్టి బుద్దెరిగి ఒక్క పావలా కుంకుమ కూడా కొనలేదంటే ఎవరూ నమ్మరు. తీరిక దొరికినప్పుడల్లా ఏ గంగమ్మ గుడికో, పోలేరమ్మ గుడికో పోవడం, అక్కడి నుంచి కుంకుమ పొట్లం తెచ్చుకొని జాగ్రత్తగా భద్రపరచడంలో అందరూ అతని ముందర దిగదుడుపే.

ఇన్ని కండిషన్లతో కాపురం చేయలేని తారుడబ్బా చెంచురామయ్య భార్య ఏనాడో ఎదురింటి గంగులు గాడితో లేచిపోయి 'హమ్మయ్య' అని వూపిరిపీల్చుకొంది.

ఏ మాత్రం అనుబంధాలు, రక్త సంబంధాలు లేని చెంచురామయ్య సంపాదన రోజు రోజుకూ వడ్డీ కాసుల వాడి హుండీలాగా కళకళలాడసాగింది.

అన్నీ మంచి లక్షణాలే వున్న చెంచు రామయ్యకు అప్పుడప్పుడూ ఆడగాలితో సేద తీర్చుకొనే ఒక పాడు అలవాటు కూడా వుంది. అదీ బేరసారాలు నిక్కచ్చిగా తేల్చుకొన్న తర్వాతే రంగంలోకి ప్రవేశించేవాడు.

** ** ** ** *

రాత్రి తొమ్మిదయింది. పెళ్లి కొడుకులా ముస్తాబై మంచి హుషారులో వున్నాడు చెంచురామయ్య. అరువు తెచ్చుకొన్న పౌడర్‌ను ముఖానికేసి బాగా పట్టేస్తున్నాడు. చాలా రోజుల తరువాత సాహసం చేసి అద్దంలో ముఖం చూసుకొన్నాడు. 'ఎలుక తోక తెచ్చి యాడాది వుతికినా నలుపు నలుపేగాని తెలుపుగాదు' అన్నట్టు వెక్కిరించింది తన ప్రతిబింబం. తనకే అసహ్యం వేసేసరికి ఇక ముందెప్పుడూ తన ముఖాన్ని చూడనేకూడదనుకొన్నాడు.

ఎవరి కోసమో ఎదురు చూస్తున్నాడు చెంచు రామయ్య. మాటిమాటికి తలుపు దగ్గరకెళ్ళి చూస్తు న్నాడు. కొంతసేపటికి వూహించిన ప్రకారం ఓ రిక్షా వచ్చి ఆగింది తన ఇంటి ముందు. రిక్షాలోని ఆకారాన్ని లోపలికి రమ్మని ఆహ్వానిస్తూ సైగ చేశాడు.

రోడ్డుపై జన సంచారమేమీ వున్నట్లు లేదు. 'హమ్మయ్య' అని వూపిరి పీల్చుకొన్నాడు చెంచు రామయ్య.

రిక్షాలో నుంచి ఓ అందాల భరిణ దిగి వయ్యారంగా నడుచుకొంటూ లోపలికెళ్ళింది. లైటు వెలుతురులో ఆమె ముఖం చూసేసరికి దిమ్మతిరిగి పోయింది చెంచు రామయ్యకు. మెర్క్యురీ లైటులా వెలిగిపోతోంది ఆ సుందరి. ఆమె కౌగిట్లో చేరి తన ఆకలి తీర్చుకొన డానికి వువ్విళ్లూరుతున్నాడు చెంచురామయ్య.

నిక్కచ్చి చెంచురామయ్య నిక్కచ్చిగా బేరం మొదలెట్టాడు. ఈ గోజులాటలో అర్థగంట దాటి పోయింది. ఆ తర్వాతగాని ఓ బేరానికి చేరుకోలేక పోయాడు చెంచురామయ్య. దాంతో ఆ సుందరి తనదై పోయింది ఆ రాత్రికి.

తన ఇంటి ముంగిట్లోని మల్లె పందిరి నుంచి విడ దీసిన పూలన్నీ సాయంత్రమే అమ్మగా మిగిలిన అరసావు మల్లెలు పరుపుపై పరిచాడు చెంచురామయ్య. ఒక నెలనాళ్ళ నుంచీ స్త్రీ పొందుకై పరితపిస్తున్న తను ఇక ఒక క్షణం కూడా వృథా చేయకూడదని నిర్ధారించుకొన్నాడు.




క్షణంలో ఆ సుందరాంగిని వివస్త్రనుచేసి ఆంబోతులా ఆమెపై పడి ముప్పై రోజుల ఆకలి ఒకేసారి తీర్చు కొన్నాడు చెంచురామయ్య.

పన్నెండు దాటింది. తన అందాలతో చెంచు రామయ్య ఆకలి తీర్చిన సుందరాంగి లేచి చీర కట్టు కొంది. వెళ్ళడానికి సిద్ధమవుతూ తన నుదుటిపై నున్న బొట్టును చెరపడానికి చేయెత్తింది. ఒక్క పరుగులో ఆమెను సమీపించాడు చెంచురామయ్య. ఆమె బొట్టు చెరిపేస్తుంటే కుంకుమంతా తన చేతిలో పడేటట్టు చేతిని అడ్డంగా పెట్టాడు. దాన్ని భద్రంగా తీసి తన కుంకుమ డబ్బీలో పదిలం చేసికొని ఒక వెర్రి నవ్వు నవ్వాడు. అతని కక్కుర్తికి వళ్ళు మండిపోయింది ఆవిడకు. "డబ్బులొద్దా బుజ్జీ" అని అడిగాడు చెంచు రామయ్య నేరుగా వెళ్ళిపోతున్న ఆ సుందరాంగిని చూచి.

"నువ్వే వుంచుకో. నిన్ను కాల్చడానికి పనికొస్తుంది" అంది సుందరాంగి. సమ్మెట పోటు పడినట్లయింది చెంచురామయ్యకు.

"పసుపు కుంకుమలకు ఏనాడో దూరమైన నేను నా బిడ్డకోసం పడుపు వృత్తి మొదలెట్టినప్పుడు బాధ పడ లేదు నేను. విధవనై వుండి పవిత్రమైన బొట్టును అపహాస్యం చేస్తున్న ప్రతి రాత్రీ బాధపడలేదు. కాని మలినమైపోయిన నా శరీరం నుండి కుంకుమ రాల్చుకొని దాచుకొన్న నీ నీచపు బ్రతుకు చూచి బాధపడు తున్నాను. కుక్కకన్నా హీనమైన నీ బతుకు చూసి బాధపడుతున్నాను. నీ డబ్బుతో నా బిడ్డకు పట్టెడు మెతుకులు పెట్టినా అది తప్పకుండా శపించి చస్తుంది. ఛీ పాడు బతుకు" అంటూ తలుపు తెరుచుకొని చక్కా వెళ్ళిపోయింది సుందరి.

ఆమె మాటలు కొద్దిగా బాధ కలిగించినా తన చేతి నుండి ఆమె చేతిలోకి వెళ్లాల్సిన ఇరవై రూపాయిల నోటు తన దగ్గరే మిగిలిపోవడంతో ఆనందపడిపోయాడు చెంచురామయ్య. **

మా ఇంటర్ విద్యార్థుల-విజయకీర్తి, గురుకుల విద్యావ్యవస్థకే ఘనకీర్తి

అమరావతి రెసిడెన్షియల్ కాలేజి

మెడికల్ కాలేజి రోడ్, జిల్లాకోర్టు ఎదుట, గుంటూరు-4. PHONE: 21665

నూటికి నూరు శాతం (100% 1St CLASSES).
సాధించిన ఇంగ్లీషు మీడియం M.P. & Bi.P. విద్యార్థులకు మా అభినందనలు
ఇంటర్ M.P.; Bi.P., C.E.C (తెలుగు మీడియం ఉత్తీర్ణత 94.5%
ఇంటర్ అన్నిగ్రూపుల ఉత్తీర్ణత: 95.6%

జూనియర్ ఇంటర్ అడ్మిషన్ నోటీస్
M.P; Bi.P ( ఇంగ్లీషు మరియు తెలుగు మీడియం)
C.E.C (తెలుగు మీడియం మాత్రమే) అడ్మిషన్లు 6-6-88 నుండి
M.P. గ్రూపుకు ప్రవేశ అర్హత $X^{th}$ 1st CLASS.
Bi.P. గ్రూపుకు ప్రవేశ అర్హత $X^{th}$ 2nd CLASS.

మెరిట్ స్కాలర్‌షిప్స్ ఇస్తున్న ఏకైక సంస్థ!

పదవ తరగతిలో సాధించిన మార్కుల ప్రాతిపాదికపై మావద్దచేరు జూనియర్ ఇంటర్ విద్యార్థులకు మెరిట్ స్కాలర్ షిప్ యివ్వబడును. మెరిట్ స్కాలర్ షిప్ వివరాలు ప్రాస్పెక్టస్‌లో పొందుపరచబడినవి. జూనియర్ ఇంటర్‌కు పై గ్రూపులలో అడ్మిషన్లు, ఇంటర్వ్యూ మరియు ఓరల్ టెస్ట్ ద్వారా జరుగును. ఓరల్ టెస్టు సిలబస్ వివరములు ప్రాస్పెక్టస్‌లో పొందుపరచబడినది. ప్రాస్పెక్టస్ మరియు అప్లికేషన్‌లను స్వయముగా సంప్రదించిగాని లేక కార్డు వ్రాసిగాని పొందండి.

గమనిక:- సీనియర్ ఇంటర్ క్లాసులు 6-6-1988 నుండి పునః ప్రారంభము.

డైరెక్టర్
అమరావతి రెసిడెన్షియల్ కాలేజి.

ADITYA